సాక్షి విజయనగరం

గురువారం । 8 । జూన్ । 2023



పెళ్లింట విషాదం
అంగరంగ వైభవంగా పెళ్లి తంతు ముగించాలని అంతా ఏర్పాట్లు చేసుకుంటున్న ఆ ఇంట పెనువిషాదం నెలకొంది. - 8లో



సమన్వయం చేయండి
సర్వే బృందాలు భూ హక్కుదారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని జేసీ రోణంకి గోవిందరావు సూచించారు. - 8లో



డ్రైవరే దోపిడీ సూత్రధారి
జాతీయరహదారిపై జరిగిన దారి దోపిడీ కేసును ఛేదించినట్లు డీఎస్పీ ఆర్.గోవిందరావు బుధవారం వెల్లడించారు. - 8లో

న్యూస్‌రీల్

జాబ్ మేళా రేపు
చీపురుపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ నేతృత్వంలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం శ్యామలసాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు 18 పరిశ్రమలు ఈ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీటెక్ చదువుకున్న నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వివరాల కోసం 90100 23033, 72860 42743, 90001 02013 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు
విజయనగరం టౌన్: విద్యార్థులకు బస్ పాస్‌ల జారీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి సిహెచ్.అప్పలనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, ఎస్.కోట బస్‌స్టేషన్ల వద్ద ఉన్న కౌంటర్లు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకూ పని చేస్తాయన్నారు. విద్యా సంస్థల ధ్రువీకరణ చేసిన సర్టిఫికెట్ అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పూరీ జగన్నాథ యాత్రకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీస్



విజయనగరం టౌన్: పూరీ జగన్నాథ యాత్రకు సంబంధించి ఆర్టీసీ ప్రత్యేక బస్ సర్వీస్ ఏర్పాటు చేస్తున్నామని ఆర్టీసీ ప్రజా రవాణాధికారి సిహెచ్.అప్పలనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు ఈ నెల 19న సోమవారం విజయనగరం నుంచి బయలుదేరి 20న ఉదయం 6 గంటలకు భువనేశ్వర్ చేరుతుందన్నారు. అక్కడ లింగరాజ్ ఆలయం దర్శనం అనంతరం 10 గంటలకు కోణార్క్ సూర్య దేవాలయం దర్శనం చేయిస్తామన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు పూరీ చేరుతుందన్నారు. రథయాత్ర అనంతరం రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు 21న ఉదయం విజయనగరం బస్ స్టేషన్‌కు చేరుతుందన్నారు. వివరాలకు 73829 20648, 99592 25620 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఐఈఆర్‌పీ సిబ్బందికి రిక్వెస్ట్ బదిలీలు
విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని 34 మండలాల్లో గల భవిత కేంద్రాల్లో పని చేస్తున్న ఐఈఆర్‌పీ సిబ్బందికి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ ఆన్ హ్యూమనిటరిన్స్ గ్రౌండ్స్ ప్రాతిపదికన దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ బి.లింగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయదలచిన అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ నుండి 9వ తేదీ వరకు మాత్రమే స్వయంగా సమగ్రశిక్ష కార్యాలయంలో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ పూర్వపు జిల్లాలో మాత్రమే పరిగణించబడుతుందన్నారు.

జెడ్పీ ప్రాంగణంలో విద్యుత్ వాహన మేళా రేపు
- నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ రాజు

విజయనగరం అర్బన్: జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఈ నెల 9వ తేదీన 'గో ఎలక్ట్రిక్- గో గ్రీన్' పేరుతో విద్యుత్ వాహన మేళా నిర్వహించనున్నట్లు నెడ్ క్యాప్ జిల్లా మేనేజర్ ఎంవీకే రాజు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి ఎస్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చేతుల మీదుగా మేళా ప్రారంభమై సాయంత్రం వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. మేళాలో వివిధ రకాల ద్విచక్ర వాహనాలు, కార్లు ప్రదర్శనలో ఉంచుతామని, వినియోగదారులకు లైవ్ డెమో అవకాశం కూడా కల్పించామని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగుల సౌకర్యార్థం ఈ మేళాను నిర్వహిస్తున్నామని వారికి ఈఎంఐ సదుపాయంతో వాహనాలను నిర్ణీత ధరకే అందజేస్తామని వెల్లడించారు. ఈ మేరకు మేళాకు సంబంధించిన అంశాలను వివరిస్తూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పర్యావరణాన్ని కాలుష్యం బారి నుంచి కాపాడేందుకు ఇంధన వనరులను పొదుపు చేసేందుకు, విద్యుత్ వాహనాల ఆవశ్యకతను వినియోగదారులకు తెలియజేసేందుకు ఈ మేళాను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గో ఎలక్ట్రిక్ – గో గ్రీన్ నినాదంతో నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సాధారణ వినియోగదారులు కూడా మేళాలో పాల్గొనవచ్చని స్పష్టం చేశారు.

ప్రగతి బాటన పల్లెలు

జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు నడుం బిగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రగతి పాలనకు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల చెంతకే చేరేలా సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లను ఇంటింటికి పంపి సంక్షేమ పథకాలను అందజేస్తూ.. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని నిజం చేస్తూ ముందుకు వెళ్తున్నారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలన్న విషయాన్ని నిజం చేస్తున్నారు.

- గ్రామీణులకు అందుబాటులో ప్రభుత్వ కార్యాలయాలు
- రూ.కోట్లతో కార్పొరేట్ స్థాయి భవనాలను నిర్మిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు
- సచివాలయ వ్యవస్థకు సరికొత్త భవనాలు
- రూ.194 కోట్లతో జిల్లాలో 530 సచివాలయ భవన నిర్మాణాలు
- రూ.106.6 కోట్లతో రైతు భరోసా కేంద్రాలు
- రూ.76.65 కోట్లతో 435 వెల్‌నెస్ కేంద్రాలు
- వీటితో పాటు 140 బల్క్‌మిల్క్ కేంద్రాల నిర్మాణం

విజయనగరం రూరల్:

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఏర్పడిన తరువాత అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తూ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా పల్లె ప్రజలకు సకల సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ సేవలు వారి ముంగిటకే వెళ్లేలా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి సేవలను విస్తృతం చేసింది. దీంతో పల్లెలు ప్రగతి బాటలో దూసుకుపోతున్నాయి. సచివాలయ వ్యవస్థ ద్వారా వలంటీర్లను ఇంటికే పంపి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరువ చేయడమే కాకుండా ప్రభుత్వ పాలనకు వీలుగా ప్రతి వ్యవస్థకు సొంత భవనాలు సమకూర్చుతూ అభివృద్ధే ధ్యేయంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.400 కోట్లతో గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణంతో పాటు బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నారు.



సారిక గ్రామ సచివాలయ భవనం

రూ.194 కోట్లతో సచివాలయ భవన నిర్మాణాలు
జిల్లా వ్యాప్తంగా రూ.194 కోట్లతో 530 గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలను నిర్మిస్తుంది. వీటిలో టైప్ – 1 భవన నిర్మాణానికి రూ.40 లక్షలు, టైప్ – 2 భవన నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేయడంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 372 భవనాలను కార్పొరేట్ స్థాయిలో నిర్మాణం పూర్తి చేశారు. మరో 154 గ్రామ సచివాలయాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఇప్పటికే వీటికి సంబంధించి రూ.130.06 కోట్లకు పైగా బిల్లుల చెల్లింపులు కూడా జరిగాయి.

రూ.76.65 కోట్లతో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం
జిల్లాలో 435 వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.76.65 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో నిర్మాణానికి రూ.17.5 లక్షల చొప్పున నిధులు మంజూరు చేయడంతో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిలో 163 వెల్‌నెస్ కేంద్రాలు నిర్మాణం పూర్తి చేసుకోగా మిగతా కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణాలకు సంబంధించి రూ.39.40 కోట్ల బిల్లులు చెల్లింపులు చేశారు.

> **సెప్టెంబర్‌లో అందుబాటులోకి...**
>
> జిల్లా వ్యాప్తంగా రూ.400 కోట్లకు పైగా నిధులతో గ్రామ సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్ మిల్క్ కేంద్రాల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాలు 60 శాతం నుండి 80 శాతం వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. సెప్టెంబర్ నెలాఖరు నాటికి అన్ని భవన నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తాం.
>
> – జీఎస్ రమేష్‌గుప్త, పంచాయతీరాజ్ ఎస్ఈ, విజయనగరం

రూ.96 లక్షలతో డిజిటల్ లైబ్రరీల నిర్మాణం
గ్రామాల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అందుబాటులో ఉండేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు ఆలోచనతో వీటి నిర్మాణాలకు ఇటీవల శ్రీకారం చుట్టారు. జిల్లాలో 173 లైబ్రరీలు మంజూరయ్యాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.16 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో వీటి నిర్మాణాలు ఇటీవల ప్రారంభమయ్యాయి. అలాగే పాడి రైతుల సంక్షేమానికి గ్రామాల్లో బల్క్‌మిల్క్ కూలింగ్ కేంద్రాలను మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 140 కేంద్రాలను మంజూరు చేశారు. ఇప్పటికే 14 భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి.



ద్వారపూడిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వెల్‌నెస్ కేంద్రం

ఆర్‌బీకేల నిర్మాణాలకు రూ.106.6 కోట్లు
రైతు సంక్షేమమే లక్ష్యంగా వారికి గ్రామాల్లోనే విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను నిర్మించాలని తలపెట్టారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.21.8 లక్షలు మంజూరు చేయడంతో జిల్లా వ్యాప్తంగా 496 ఆర్‌బీకేలు మంజూరయ్యాయి. ఇప్పటికే వీటిలో 261 భవన నిర్మాణాలు పూర్తి చేసుకోగా, మరికొన్ని భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి నిర్మాణాలకు సంబంధించి రూ.58.82 కోట్లు బిల్లులు చెల్లింపులు చేశారు.



దుప్పాడలో రైతుభరోసా కేంద్రం

పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు
- నిధుల దుర్వినియోగంపై స్పందించిన ఉన్నతాధికారులు

రేగిడి: మండలంలో విధులు నిర్వహించిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు పడింది. గతంలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహించిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు అధికార దుర్వినియోగం చేసి, నిధులు పక్కదోవ పట్టించారు. పంచాయతీ సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఉన్నతాధికారులు రంగంలోకి దిగి దర్యాప్తు చేయడంతో వారి అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అంబాడ పంచాయతీలో 2018 – 21 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ కార్యదర్శులుగా పని చేసిన బసవ శ్రీనివాసరావు, ఐ.గోపిపై ప్రత్యేకాధికారుల పాలనలో నిధులు దారి మళ్లించారనే ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం పంచాయతీ సర్పంచ్‌గా ఉన్న చుక్కా వెంకటినాయుడు ఈ వ్యవహారంపై ఇటీవల జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ డీపీఓకు దర్యాప్తు నిమిత్తం ఆదేశాలివ్వడంతో గత నెల మే 5న డీఎల్‌పీఓ మోహనరావు దర్యాప్తు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు చేసిన అక్రమాల నివేదిక రూపొందించి శ్రీకాకుళం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు అందించారు. గతంలో ఈ పంచాయతీ శ్రీకాకుళం జిల్లాలో ఉండడంతో అక్కడి జిల్లా అధికారులకు చర్యలు నిమిత్తం ఈ నివేదికలు అందజేశారు. ప్రస్తుతం ఈ ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల్లో ఒకరు లావేరు మండలంలో, మరొకరు రేగిడి పంచాయతీ కార్యదర్శిగా ఉన్నారు. అక్రమాలు వివరాలు తీసుకున్న కలెక్టర్ వీరిద్దరిని సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆన్‌లైన్ ద్వారా స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సమాచారం బుధవారం అందించారు. వీరిద్దరు పంచాయతీలో 14వ, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.20 లక్షల మేర తమ కుటుంబ సభ్యుల పేర మీద విత్‌డ్రాలు చేయడం, నిధులు తప్పుదోవ పట్టించడం కారణంగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంపీడీఓ బాసూరీ శంకరరావు వద్ద సాక్షి ప్రస్తావించగా ఇద్దరు పంచాయతీ కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఆన్‌లైన్‌లో సమాచారం వచ్చిందని, నేరుగా తమ వద్దకు ఆర్డర్ కాగితాలు వస్తేనే ధ్రువీకరించగలమని వెల్లడించారు. అంబాడ పంచాయతీ సర్పంచ్ వెంకటినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ దర్యాప్తు జరిగిందని అన్నారు.

గర్భిణులపై ప్రత్యేక పర్యవేక్షణ
- జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి శాంతకుమారి

విజయనగరం ఫోర్ట్:

గర్భిణుల పట్ల ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి బి.శాంతకుమారి పేర్కొన్నారు. స్థానిక 30వ సచివాలయంలో జరిగిన ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు వైద్య తనిఖీలు సక్రమంగా చేసుకునేలా చూడాలని సూచించారు. గృహ సందర్శనలు చేసి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించాలని కోరారు. మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఐసీడీఎస్, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. తల్లీబిడ్డలు సురక్షితంగా ఉండేలా ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు చూసుకోవాలన్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యమైనదిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ తదితరులు పాల్గొన్నారు.



ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శాంతకుమారి

కల నెరవేరనుంది...
- ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని
- బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

సంతకవిటి:

ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన బలసలరేవు బ్రిడ్జి నిర్మాణం కల త్వరలోనే నెరవేరనుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని వాల్తేరు దగ్గర బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలం నాటి చిరకాల కోరిక వలసలరేవు వారధి అని అన్నారు. దీని నిర్మాణంతో శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస, విజయనగరం జిల్లాలోని సంతకవిటి మండలాల మధ్య ప్రయాణం సులభతరం కానుందన్నారు. రూ.87 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం జరగనుందని, బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు కోసం 13 ఎకరాల భూసేకరణ అవసరమన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరిక నెరవేర్చనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారధి నిర్మాణం పూర్తయితే రైతులు పండించే పంటలు సకాలంలో మార్కెట్‌కు చేరుతాయని, భూముల ధరలు పెరుగుతాయన్నారు. విద్యార్థులకు ప్రయాణం సులభతరమై మరింతగా చదువుకోగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, పొందూరు, ఆమదాలవలస, సంతకవిటి మండలాల నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో టెంకాయ కొడుతున్న రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాం

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం
- ఆనందోత్సవాల్లో ఉద్యోగులు

విజయనగరం అర్బన్:

రాష్ట్ర ప్రభుత్వంలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగుల కల నెరవేరింది. వివిధ శాఖల్లో పని చేస్తున్న వీరిని క్రమబద్ధీకరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ఆమోదం తెలిపి కాంట్రాక్టు సంకెళ్లను తెంచింది. దీంతో కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపినట్లయింది. ఈ మేరకు బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆమోదం తెలిపింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి మండలి ప్రకటించింది. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఇప్పటికే 98 శాతం అమలు చేసిన చరిత్ర ప్రభుత్వానికి ఉంది. దీంతో 20 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న వారి కల నెరువేరుతోంది. రాష్ట్ర విభజన జరిగిన 2014 జూన్ 2 నాటికి అయిదేళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనతో ఇరవై ఏళ్ల సమస్యకు పరిష్కారం దొరికింది.

జిల్లాలో సుమారు 500 మందికి లబ్ధి
రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు 10,110 మందికి వర్తిస్తుందని మంత్రి మండలి ప్రకటించింది. జిల్లాలో అత్యధికంగా వైద్య రంగంలోని వివిధ కేటగిరి పోస్టులకు కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు జరిగాయి. తరువాత స్థానంలో జూనియర్ కళాశాలలో, పాలిటెక్నికల్ కళాశాలల్లో అధ్యాపకులు ఉన్నారు. జిల్లా పరిధిలోని వారి సంఖ్య వివరాలు ఇంకా రావాల్సి ఉంది. ఒక అంచనా ప్రకారం 400 నుంచి 500 మంది ఉంటారని తెలుస్తోంది. వీరి జీవితాల్లో కొత్త వెలుగులు విరజిమ్మనున్నాయి.

> **కేబినెట్ నిర్ణయం చారిత్రాత్మకం**
>
> 
>
> కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామని గత ప్రభుత్వాలు చెప్పినా చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. ఆయన ఆదేశాల మేరకు రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ఎందరికో ఉద్యోగ భద్రతనిచ్చి మరింత ఉత్సాహకంగా విధులు నిర్వహించగల శక్తిని ఇస్తుంది. 20 ఏళ్లుగా ఎప్పుడు ఉద్యోగం పోతుందోనని ఉద్యోగ భద్రత లేకుండా బతికాం. ఇప్పుడు మనోధైర్యంతో విధులను నిర్వహించగలుగుతాం. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు మంత్రి వర్గ ఉప సంఘంలో కీలకపాత్ర పోషించిన మంత్రి బొత్స సత్యనారాయణకు ప్రత్యేక కృతజ్ఞతలు.
>
> – వీవీఎస్ఆర్‌ప్రసాద్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పారా మెడికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్

> **క్రమబద్ధీకరణ చేస్తారనే నమ్మకం పోలేదు**
>
> 
>
> ఏఎన్ఎం ఉద్యోగంలో 21 ఏళ్ల క్రితం కాంట్రాక్టు పద్ధతిలో జాయిన్ అయ్యాను. క్రమబద్ధీకరణ చేస్తామని అప్పటి నుంచి ఎన్నికల ముందు గత ప్రభుత్వాలు హామీ ఇచ్చేవి. ఎవరూ అమలు చేయలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో జరగాల్సిన క్రమబద్ధీకరణ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తారని గట్టి నమ్మకం పెట్టుకున్నాం. వాళ్ల మాటిస్తే చేస్తారనే నమ్మకంతోనే పక్కా ప్రభుత్వ ఉద్యోగమైన సచివాలయ కార్యదర్శి ఉద్యోగం వచ్చినా వెళ్లలేదు. వైద్య రంగంపై ముఖ్యమంత్రి పెడుతున్న ప్రత్యేక శ్రద్ధ నేపథ్యంలో ఈ రంగంలోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తారనే నమ్మకం నిజం చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.
>
> –దబేరు పద్మావతమ్మ, ఏఎన్ఎం, పీహెచ్‌సీ, దేవుపల్లి, బొండపల్లి మండలం

> **స్వాగతిస్తున్నాం..**
>
> 
>
> 2014 జూన్ 2 నాటికి 5 సంవత్సరాల సరీ్వసు పూర్తి చేసుకున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఎలాంటి షరతులు లేకుండా వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ పథకాలు, యూనివర్సిటీలు, సొసైటీలలో కూడా పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను ఆయా సంస్థలలో రెగ్యులరైజ్ చేసేలా చర్యలు చేపట్టాలి. గత ఏడాది డిసెంబర్ నాటికి 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ రెగ్యులరైజ్ చేసే అంశాన్ని పరిశీలించాలి.
>
> – బి.కాంతారావు, జిల్లా చైర్మన్, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల, టీచర్ల జేఏసీ

> **థాంక్యూ సీఎం సార్**
>
> 
>
> 12వ పీఆర్సీ కమిషన్ నియామకానికి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం అభినందనీయం. ఎన్నికల వేళ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు ఉద్యోగుల తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. పీఆర్సీ కమిషన్ ఆమోదంతో జిల్లాలో 11,934 మంది ఉద్యోగులకు, 6,559మంది పింఛన్‌దారులకు ప్రయోజనం కలగనుంది. 2014 జూన్ 2 నాటికి ఐదేళ్లు పూర్తి చేసుకున్న 1631మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఏపీ వైద్య విధాన పరిషత్ స్వయం ప్రతిపత్తి చట్టం రద్దుపరుస్తూ కమిషనర్ వైద్య విధాన పరిషత్ అనే పేరును డైరెక్టర్, సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా పేరు మారుస్తూ, వైద్య విధాన పరిషత్‌ను ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలా మార్చుతూ తీర్మానం చేయడం అభినందనీయం. సీపీఎస్ బదులు జీపీఎస్ నిర్ణయాన్ని పునఃపరిశీలన చేయాలన్నారు.
>
> – జీవీఆర్ఎస్ కిశోర్, ఏపీ ఎన్జీఓ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు

త్రివిధ దళాల్లో ప్రవేశాలకు ఉచిత శిక్షణ
- సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్



విజయనగరం: దేశ రక్షణలో కీలక పాత్ర పోషించే త్రివిధ దళాల్లో ఉద్యోగంలో చేరదలచిన నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్ బుధవారం తెలిపారు. అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ (ఆర్మీ), అగ్నివీర్ వాయు (ఎయిర్ ఫోర్సు), అగ్నివీర్ (నేవీ)లో నియామకానికి సంబంధించి అర్హులైన యువతీ, యువకులకు విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. అగ్నిపథ్ పథకంలో భాగంగా అగ్నివీర్ (ఆర్మీ) రిక్రూట్‌మెంట్ ర్యాలీ జూలై 20 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో జరగనుందని తెలిపారు. ఈ నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో అర్హులైన యువతీ, యువకులకు ఈ నెల 10వ తేదీ నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు 40 రోజుల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పోలీస్ కుటుంబాల అభ్యున్నతికి కృషి


హెచ్‌సి రామకృష్ణ సతీమణి శైలజకు చెక్ అందజేస్తున్న అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: పోలీసు కుటుంబాల అభ్యున్నతికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లవేళలా కృషిచేస్తోందని అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసుశాఖలో ఆర్మ్‌డ్ రిజర్వు హెచ్‌సీగా పనిచేస్తూ, ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన ఎ.రామకృష్ణ సతీమణి శైలజకు జిల్లా పోలీసు ఉద్యోగులు చేయూత కింద సమకూర్చిన రూ.లక్షా 50వేల 500 చెక్‌ను ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు కామేశ్వరరావు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


లారీ ఢీ కొనడంతో నేలకొరిగిన కరెంట్ పోల్

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణంలో పెనుప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఒడిశా నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ బైపాస్ రోడ్డు వద్ద హై టెన్షన్ కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో పోల్ విరిగి నేలకొరిగింది. వేకువ జామున 3:30 గంటల సమయంలో ఈ ఘటన జరగడంతో పెనుప్రమాదం తప్పిందని విద్యుత్ శాఖ ఏఈ రామారావు చెప్పారు. రహదారిపై ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు.

ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చెయ్యొద్దు

విజయనగరం పూల్‌బాగ్: ఉపాధ్యాయ బదిలీల్లో ఖాళీలను బ్లాక్ చెయ్యొద్దని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జేఆర్‌సీ పట్నాయక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు వి. వాసుదేవరావు, కె.ప్రసాదరావు, జి.రాజారావు, ఆనంద్, శోభన్‌బాబు, వాసుదేవరావు, చంద్రరావు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తోటలో అగ్ని పిడుగు


తోటలో పడిన పిడుగుతో పెద్దఎత్తున ఎగిసిపడిన మంటలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దుమ్మెద గ్రామానికి వెళ్లే రహదారిలో గల తోటలో అగ్నిపిడుగు పడి పెద్ద మంటలు ఎగిసిపడ్డాయని ఎస్సై ఎల్.దామోదరరావు తెలిపారు. ఈ మేరకు మండలంలో బుధవారం సాయంత్రం గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో తోటలో పెద్ద పిడుగు పడింది. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఎస్సై దామోదరరావు పిడుగుపాటు సమాచారం తెలుసుకుని వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు.అదే విధంగా పిడుగు పడే ప్రాంతంలో 33కేవీ విద్యుత్‌లైన్ కూడా ఉండడంతో ఇదే విషయంపై విద్యుత్‌శాఖ అధికారులకు కూడా సమాచారం అందించి ఎలాంటి ప్రమాదం జరగకుండా చూశారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,650-00
బంగారం(22సి. 10గ్రా.)	55,600-00
వెండి (కిలో)	77,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹167	₹304	₹ 314

పెళ్లింట పెనువిషాదం

- డాబాపై నుంచి పడి వరుడి మృతి

రాజాం సిటీ: అంగరంగ వైభవంగా పెళ్లి తంతు ముగించాలని అంతా ఏర్పాట్లు చేసుకుంటున్న ఆ ఇంట పెనువిషాదం నెలకొంది. బంధుమిత్రుల సందడి, పెళ్లి బాజాలు మోగాల్సిన ఆ ఇంట చావు డప్పు మోగింది. ఈ విషాదంపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక వాసవీ థియేటర్ ఎదురుగా ఉన్న వీధిలో నివాసం ఉంటున్న వజ్జపర్తి సూర్యారావు (26)కు బుధవారం రాత్రి 12.55 గంటలకు పెళ్లి జరగాల్సి ఉంది. అయితే బుధవారం వేకువజామున 4.30 గంటల ప్రాంతంలో రెండంతస్తుల డాబాపై నుంచి ప్రమాదవశాత్తు మరో డాబాపై జారి పడిపోవడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి శ్రీకాకుళంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.



ఆస్పత్రిలో సూర్యారావు మృతదేహం (ఇన్‌సెట్లో) సూర్యారావు (ఫైల్)

దీంతో వరుని కుటుంబంతోపాటు వధువు కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

20 ఏళ్లుగా నూడిల్స్ షాపులో పనిచేస్తూ..

బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన వజ్జపర్తి సూర్యారావు సోదరుడు శ్రీనివాసరావుతోపాటు బతుకుతెరువు నిమిత్తం 20 ఏళ్ల క్రితం రాజాం వచ్చి ఓ నూడిల్స్ పాయింట్‌లో పనిచేస్తున్నాడు. ఇద్దరూ కష్టపడి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం సోదరుడు శ్రీనివాస రావు వివాహం చేసుకోగా రాజాంలో ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు. అయితే ఇద్దరికీ ఇళ్లు ఉండాలన్న ఉద్దేశంతో ఇంటిపైనే మరో ఇంటి నిర్మాణం చేపట్టారు. మూడు నెలల క్రితం సూర్యారావుకు పెళ్లి సంబంధం కుదరడంతో పెళ్లి సందడితో ఉన్న ఆ కుటుంబంలో పెళ్లి కుమారుడి మృతితో తీవ్ర విషాదం నెలకొంది.

భూ హక్కుదారులతో సమన్వయం చేయండి

- జేసీ రోణంకి గోవిందరావు

పాలకొండ రూరల్: సమగ్ర భూ సర్వేను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న క్రమంలో సర్వే బృందాలు భూ హక్కుదారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని జేసీ రోణంకి గోవిందరావు సూచించారు. ఈ మేరకు పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్‌తో కలిసి బుధవారం పట్టణ పరిధి వీరఘట్టం రహదారిలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను జేసీ ఆకస్మికంగా సందర్శించారు. ఈ క్రమంలో సర్వే జరుతున్న తీరును రైతులు, భూ యజమానులను అడిగి తెలుసుకున్నారు. వారి సూచనలు నమోదు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే చేపట్టే సమయం, సర్వేనంబర్లు ముందుగానే హక్కుదారులకు తెలియజేయాలని చెప్పారు. స్థానిక అధికారులు రూపొందించిన 'రీ సర్వే' వాట్సాప్ గ్రూప్‌ను మెచ్చుకున్నారు. సకాలంలో ఈ ప్రక్రియ ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, మొబైల్ రీసర్వే అధికారి పి.సన్యాసిరావు, మండల సర్వేయర్ పి.వెంకటరావు, సర్వే బృందాల సిబ్బంది, భూ హక్కుదారులు పాల్గొన్నారు.


సర్వే జరుగుతున్న తీరుపై రైతులు, భూ హక్కుదారులతో మాట్లాడుతున్న జేసీ

ఏపీవీవీపీని ప్రభుత్వ శాఖగా మార్చినందుకు కృతజ్ఞతలు

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన్ పరిషత్ స్వయం ప్రతిపత్తి చట్టం రద్దు చేస్తూ కమిషనర్ వైద్యవిధాన్ పరిషత్ అనే పేరుగా డైరెక్టర్ సెకండరీ హెల్త్ సర్వీసెస్‌గా పేరు మార్చారు. వైద్య విధాన్ పరిషత్‌ను వైద్య ఆరోగ్యశాఖలా ప్రభుత్వ శాఖగా మార్చుతూ మంత్రి వర్గ సమావేశంలో తీర్మానించిందుకు వైద్య విధాన్ పరిషత్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.కనకరాజు, కార్యదర్శి బి.జ్యోతిర్మయిలు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న తమ కలను ఎట్టకేలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేరవేర్చారని హర్షం వ్యక్తం చేశారు.

నేడే డిప్యూటీ మేయర్-1 ఎన్నిక

- ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్న జేసీ మయూర్ అశోక్
- ఏర్పాట్లు పూర్తి చేసిన కార్పొరేషన్ యంత్రాంగం

విజయనగరం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ -1 ఎన్నిక బుధవారం జరగనుంది. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కౌన్సిల్‌సమావేశ మందిరంలో జరగనున్న ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఎన్నిక ప్రక్రియలో భాగంగా 50 డివిజన్‌ల కార్పొరేటర్‌లకు ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు సమాచారం అందించగా వారంతా హాజరుకానున్నారు. ఎన్నిక ప్రక్రియలో పాల్గొనే కార్పొరేటర్‌ల కోసం కౌన్సిల్ హాల్‌లో తెలుగు అక్షరమాల ప్రకారం సీట్లు కేటాయించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాద్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.


ఎన్నికల ఏర్పాట్లు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు

రేవతీదేవి రాజీనామాతో...

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్-1గా బాధ్యతలు నిర్వహించిన ఇసరపు రేవతీదేవి ఆనారోగ్య కారణాలతో పదవి నుంచి తప్పుకున్నారు. నగరంలోని 13వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమె స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేస్తూ ఏప్రిల్ మూడవ వారంలో లేఖ సమర్పించారు. ఈ నేపథ్యంలో ఎన్నిక జరగనుంది.

ఉత్తరాంధ్రా కళాకారులకు అవకాశాలివ్వాలి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర సినీ నిర్మాతలు ఈ ప్రాంత కళాకారులు, దర్శకులకు అవకాశాలిచ్చి ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోఆర్డినేటర్, ఏపీ ఫిల్మ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు , దర్శకుడు ఎంఎస్ఎస్.బాషా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఫైబర్‌నెట్ ద్వారా సినిమాలను రిలీజ్ రోజునే ప్రతి పల్లెలో చూసే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చొరవతో కల్పించారని, చిన్న సినిమాలకు, థియేటర్స్ దొరక్క ఇబ్బంది పడుతున్న నిర్మాతలు, దర్శకులకు సీఎం తీసుకున్న నిర్ణయం వరం కాబోతుందన్నారు. చిన్న సినిమాలు నిర్మించే దర్శకులకు సినిమా నిర్మాణంలో ఎదురైన ఏ సమస్యనైనా పరిష్కరించి, వారికి వెన్నుదన్నుగా ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఉంటుందని, ఉత్తరాంధ్ర నుంచి చిన్న, పెద్ద సినీ నిర్మాతలు వారి సినిమాలను నూటికి నూరు శాతం పూర్తిగా ఆంధ్రప్రదేశ్‌లోనే చిత్రీకరించుకునే వసతులు, వాతావరణం అనుకూలంగా ఉన్నాయన్నారు.


ఎంఎస్ఎస్.బాషా, ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ కోఆర్డినేటర్

కారు డ్రైవరే దోపిడీ సూత్రధారి

- కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుల నుంచి రూ.4.70 లక్షలు రికవరీ
- నలుగురు నిందితుల అరెస్ట్
- మరో నిందితుడి కోసం గాలింపు
- ప్రెస్‌మీట్‌లో వెల్లడించిన డీఎస్పీ గోవిందరావు

పూసపాటిరేగ: పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయరహదారిపై జరిగిన దారి దోపిడీ కేసును ఛేదించినట్లు డీఎస్పీ ఆర్.గోవిందరావు బుధవారం వెల్లడించారు. ఈ మేరకు డీఎస్పీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేనెల 31 వతేదీన మధ్యాహ్నం 2 గంటల సమయంలో పర్లాకిమిడి నుంచి బియ్యం వ్యాపారి కోట్ల వంశీకృష్ణ, కారు డ్రైవర్ గొంప జయరాంతో కలిసి బియ్యం వ్యాపారానికి మధ్యవర్తి విశాఖకు చెందిన వరదరాజుల వద్దకు నగదుకోసం వచ్చారు. కొంత కాలంగా వంశీకృష్ణ కాకినాడకు బియ్యం పంపిస్తున్నాడు. బియ్యానికి సంబంధించిన నగదు విశాఖలో ఉన్న మధ్యవర్తి వరదరాజులు ద్వారా తీసుకుంటున్నాడు. తరచూ బియ్యానికి సంబంధించిన నగదును విశాఖ నుంచి పర్లాకిమిడి తీసుకువెళ్తుంటారు. ఈక్రమంలో కారు డ్రైవర్ జయరాం, తన స్నేహితుడు నందిగాం మండలం కాపుతెంబూరుకు చెందిన రుద్రపండ మధకు తరచూ కారులో నగదు తరలిస్తుంటామనే విషయమై సమాచారం ఇచ్చాడు. ఈ నేపథ్యంలో డ్రైవర్ జయరాం, స్నేహితుడు మధుకు అప్పులు ఉండడంతో కారులో నగదు తరలిస్తున్న సమయంలో దోపిడీ చేయడానికి ప్రణాళిక రచించారు. దోపిడీ చేయడానికి మధుతో పాటు పర్లాకిమిడికి చెందిన సంతోష్‌కుమార్ పట్నాయక్, సర్వసుద్ధి కుమారస్వామి, చింతాడ నరేంద్రలు రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ నలుగురు దుండగులు గత నెల 31 వతేదీన పర్లాకిమిడి నుంచి కారుతో పాటు సమాంతరంగా రెండు బైక్‌లపై విశాఖ వచ్చారు. కారు డ్రైవర్ జయరాం అవకాశం దొరికినప్పుడల్లా దుండగులకు సమాచారం చేరవేసేవాడు.


మాట్లాడుతున్న డీఎస్పీ ఆర్.గోవిందరావు

కళ్లలో కారం చల్లి బ్యాగుతో పరారీ

అదే రోజు రాత్రి 8 గంటల సమయానికి విశాఖ నుంచి మధ్యవర్తి వరదరాజులు ద్వారా వచ్చిన నగదు రూ.50 లక్షలు తీసుకుని కోట్ల వంశీకృష్ణ డ్రైవర్‌తో కలిసి పర్లాకిమిడి బయలుదేరారు. అర్ధరాత్రి 1 గంట సమయంలో పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ దాటుతుండగా అప్పటికే రెండుబైక్‌లతో కారు వెంట వస్తున్న దుండగులు కారును అడ్డగించారు. కారు అద్దాలు వ్యాపారి తెరవడంతో ఆయన కళ్లలో కారం చల్లి వెనుకసీటులో బ్యాగులో ఉన్న రూ.50 లక్షలతో పరారయ్యారు. నలుగురు నిందితులు విజయనగరంలోని ఓహోటల్‌లో గది అద్దెకు తీసుకుని డబ్బులు పంచుకున్నారు. ఒప్పందం ప్రకారం రూ. 45లక్షలు మధు తీసుకోగా, రూ.5 లక్షలు ముగ్గురు దుండగులు తీసుకున్నారు. దీనిపై డీఎస్పీ ఆర్.గోవిందరావు ఆధ్వర్యంలో 5 బృందాలు రంగంలోకి దిగి కేసు విచారణ చేపట్టాయి. సెల్‌ఫోన్ ఆధారంగా కారుడ్రైవరే దోపిడీకి ప్రధాన సూత్రధారిగా భావించి విచారణ చేసి గాలింపు చేపట్టారు. పోలీసులు ముమ్మరంగా గాలిస్తుండడంతో

భయాందోళన చెందిన డ్రైవర్ జయరాంతో పాటు ముగ్గురు నిందితులు

బైక్‌లపై విజయవాడకు వెళ్లిపోతుండగా కందివలస గెడ్డ సమీపంలో పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారి దగ్గరున్న రూ.4.70 లక్షలు నగదు, నాలుగుసెల్‌ఫోన్‌లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. రూ.45 లక్షలతో పరారైన మధు అచూకీ కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. చిక్కిన నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలియజేశారు. కేసు ఛేదించిన సీఐలు సీహెచ్ లక్ష్మణరావు, బుచ్చిరాజు, ఎస్సై ఎ.నరేష్, సీసీఎస్, సివిల్ పోలీసులను డీఎస్పీ అభినందించారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న సొత్తు, చోరీలకు పాల్పడిన నిందితుడితో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి

- 80 తులాలు వెండి, 2.5 తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ చక్రవర్తి

చీపురుపల్లి: చెడు వ్యసనాలకు బానిసై ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతూ జల్సా చేస్తూ దాదాపు ఎనిమిది పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన చోరీల్లో 40కు పైగా కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న కుప్పిలి ఆదినారాయణ అలియాస్ ముద్దుగాడును చీపురుపల్లి ఎస్సై ఎ.సన్యాసినాయుడు, సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నట్లు డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి చెప్పారు. ఈ మేరకు స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీ కేసులకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. 2022 జూలై 4న చీపురుపల్లి మండలంలోని పత్తికాయవలస, 2023 ఏప్రిల్ 26న బైరెడ్డిపేట గ్రామాల్లో చోరీలు జరిగాయి. ఈ రెండు చోరీలకు లావేరు మండలంలోని అదపాక గ్రామానికి చెందిన కుప్పిలి ఆదినారాయణ అలియాస్ ముద్దుగాడు పాల్పడినట్లు పోలీస్ సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అందులో భాగంగా బుధవారం ఉదయం మండలంలోని పత్తికాయవలస జంక్షన్‌లోని ఫుడ్ కోర్ట్ వద్ద పట్టుకుని నిందితుడి నుంచి 80 తులాల వెండి వస్తువులు, రెండున్నర తులాల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ చోరీ కేసుల్లో దర్యాప్తు బృందానికి విలువైన సూచనలు అందజేసిన సీఐ సంజీవరావు, కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై ఎ.సన్యాశినాయుడు, హెడ్ కానిస్టేబుల్స్ వేణునాయుడు, వెంకటరమణ, కానిస్టేబుల్స్ భాను, గోవింద్, రమణ, రాంబాబు, జగదీష్, హోంగార్డు రమణలను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవరావు, ఎస్సై ఎ.సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యతో నిలిచిపోయిన గూడ్స్

పార్వతీపురంటౌన్: నర్సిపురం రైల్వే గేట్ వద్ద టెక్నికల్ సమస్య ఏర్పడడంతో గూడ్స్ రైలు బుధవారం నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నర్సిపురం మీదుగా వెళ్లే వెంకటరాయుడు పేట, సన్యాసిరాజుపేట వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృతి చెందారు. ఒక ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఆయా ప్రమాదాలపై స్థానికులు, మృతుల కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

- ముగ్గురికి గాయాలు


సంఘటనాస్థలంలో క్షతగాత్రులు

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై అప్పయ్యపేట- సీతానగరం గ్రామాల మధ్య ఆర్వోబీ సమీపంలో బుధవారం ఆటో, మోటారు సైకిల్ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంపై పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బక్కుపేట గ్రామానికి చెందిన జీలకర్ర పవన్‌తేజ, గంటా దుర్గా ప్రసాద్‌లు స్వగ్రామం నుంచి పెళ్లి వస్తువులు కొనుగోలుకోసం బైక్‌పై పార్వతీపురం వెళ్తున్నారు. అదేసమయంలో పార్వతీపురం నుంచి బొబ్బిలి వైపు ఎదురుగా వస్తున్న ఆటో వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న పవన్‌తేజ, దుర్గా ప్రసాద్‌లు రోడ్డుపై పడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్, ఆటోలో ప్రయాణం చేస్తున్న ఒక మహిళ కూడా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వచ్చిన వాహనం క్షతగాత్రులను చికిత్స నిమిత్తం పార్వతీపురం మన్యంజిల్లా కేంద్రాస్పత్రికి తరలించింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పవన్‌తేజ(16) మృతి చెందాడు. ఆటోడ్రైవర్ భాస్కరరావును మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. క్షతగాత్రుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదుచేశారు.


ఆస్పత్రిలో పవన్‌తేజ మృతదేహం

స్థల వివాదంలో వక్తి..

పాచిపెంట: మండల కేంద్రంలోని కూరాకుల వీధిలో చిన్నపాటి స్థల వివాదంలో ఇరు వర్గాలు పరస్పరం దాడులు చేసుకోవడంతో ఐదుగురికి గాయాలు కాగా వారిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కూరాకుల వీధిలో మంగళవారం ఒక వర్గానికి చెందిన తూముల దాలీలు, తూముల అప్పన్న, తూముల వెంకటరమణ, మరో వర్గానికి చెందిన తూముల వెంకన్న, తూముల శ్రీరాము, తూముల పరమేష్‌లు చిన్నపాటి స్థల వివాదంలో కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి, వెంటనే వారిని సాలూరు సీహెచ్‌సీకి స్థానికులు తరలించగా తూముల దాలీలు పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం దాలీలు మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని సీఐ ధనుంజయరావు, డీఎస్పీ నాగేశ్వరరావు పరిశీలించి ఇరు వర్గాల కుటుంబాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో మొత్తం 13 మందిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కృపారావు తెలిపారు.


పాచిపెంట: దాలీలు (ఫైల్)


డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధుడు..


విజయనగరం క్రైమ్: వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై షేక్ శంకర్

విజయనగరం క్రైమ్: పట్టణంలోని పద్మావతి నగర్‌లో బుధవారం డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ వృద్ధుడు మృతిచెందాడు. దీనికి సంబంధించి టూటౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా గార మండలానికి చెందిన కె.అప్పన్న (63) స్థానిక ఆరోలైన్‌లో ఇంటి పనికి కూలీగా ఆరు నెలలుగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో పని పూర్తి చేసుకుని మంగళవారం రాత్రి భవనం ఎదురుగా ఉన్న ఇసుక తిన్నెపై పడుకున్నాడు. బుధవారం వేకువజామున ఇసుక లోడ్‌తో వచ్చిన లారీ డ్రైవర్ ఇసుకపైన పడుకున్న వృద్ధుడిని గమనించక రివర్స్‌లో ఎక్కించేశాడు. దీంతో అప్పన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య చిట్టెమ్మ ఫిర్యాదుతో టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలోపడి ఒకరు..

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర గ్రామానికి చెందిన బొరోతు అచ్చంనాయుడు (58) మతిస్థిమితంలేక పోవడంతో వీధి చివరలో శివాలయం వీధి పరిసరాల్లో ఉన్న నేలబావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్సై ఎం.రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అచ్చంనాయుడు మంగళవారం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం బావిలో శవమై కనిపించాడు. నాలుగేళ్లుగా మతిస్థిమితం లేకపోవడం కారణంగానే బావిలో పడిపోయి ఉంటాడని మృతుడి తమ్ముడు పకీరునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


మృతిచెందిన అచ్చంనాయుడు